మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పోలింగ్ కేంద్రాల పరిశీలన..

## మోడల్ పోలింగ్ కేంద్రంగా రాజాపూర్ జడ్పీ హైస్కూల్



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 19 ప్రభాతవార్త :** కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్ర శాసనసభ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్‌కుమార్ మిశ్రా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని 110,111,112 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సదరు పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలను పరిశీలించారు. అంతేకాక రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

# మద్యం విక్రయాలపై నిఘా ఉంచాలి...

**- ప్రచారాలకు వినియోగించే వాహనాల ఖర్చు అభ్యర్థుల ఖాతాలోనే చూపాలి**

**- ఎన్నికల ఖర్చుల అబ్జర్వర్ బేరా రామ చౌదరి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 19 ప్రభాతవార్త:** ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం పంపిణీ చేసే అవకాశాలు ఉండటంతో ఎక్సైజ్ శాఖ తనిఖీ బృందాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల ఖర్చుల అబ్జర్వర్ బేరా రామచౌదరి అధికారులకు సూచించారు. జిల్లాలోని 67 మద్యం దుకాణాలపై పటిష్టంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. ఎన్నికల్లో మద్యం పంచి ఓటర్లను ప్రభావితం చేయకుండా ఎక్సైజ్ శాఖతో పాటు ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పడిన సర్వైవల్, టాస్క్‌ఫోర్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు పకడ్బందీగా తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ ఉండే అభ్యర్థుల ద్వారా మద్యం దుకాణాలకు వచ్చే కూపన్లు లేదా క్రెడిట్ సందేశాల ద్వారా మద్యం విక్రయాలు ఏమైనా జరుగుతున్నాయా అని గుర్తించాలన్నారు. అలాంటి వాటిపై పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా ఎన్నికల సందర్భంగా ప్రచార రథం కోసం వినియోగించే వాహనాలకయ్యే ఖర్చులను తప్ప నిసరిగా అభ్యర్థుల ఖర్చులో చేర్చాలని ఎన్నికల ఖర్చుల అధికారులకు ఆయన సూచించారు. అదే విధంగా జిల్లాలోని మద్యం దుకాణాలకు సరఫరా అయ్యే తిమ్మాజిపేట తెలంగాణ బేవరిస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో, కొల్లాపూర్ నియోజకవర్గానికి వనపర్తి జిల్లా నుంచి సరఫరా అయ్యే డిపోలపై నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల ఖర్చుల అబ్జర్వర్ బేరా రామ చౌదరి

# 22వ అఖిలభారత సర్వమత సదస్సు..

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 19 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కొల్లంపల్లిలో హజ్రత్ సయ్యద్‌షా ఖతాల్ హుసేని 549 వార్షిక ఉర్సు సందర్భంగా అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ కొల్లంపల్లి ఆధ్వర్యంలో 22వ అఖిలభారత సర్వమత సదస్సు నిర్వహించారు. ధార్మిక సదస్సుకు సయ్యద్‌షా మహ్మద్ హుస్సేని సూఫీ సజ్జాద్ నాషన్ గోరి షరీఫ్ అధ్యక్షత వహించగా సయ్యద్‌షా జలాల్ హుస్సేని అష్రఫీ జలాలిసజ్జాద్‌నాషిన్ బర్గా ఖతాలియా కొల్లంపల్లి, ఇంఛార్జి ఆలిండియా సూఫి సజ్జాద్ నాషిన్ కౌన్సిల్ తెలంగాణ ప్రత్యేక హోదా ఎమ్మెల్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎస్.రాజేందర్‌రెడ్డి, శ్రీశ్రీ పంచమన్ సిద్ధిలింగ మహాస్వామి, చిట్టెం అభిజయ్‌రెడ్డి, కాంగ్రెస్ టిపిసిసి సభ్యుడు, మౌలానా సయ్యద్ ముస్తఫా ఖాద్రి కర్ణాటక, సయ్యద్ జలాల్ హుస్సేనీ, షమీమ్ కోయిలకొండ, మౌలానాఅబ్దుల్ నాసిర్ మజాహిరి, ఇతర రాజకీయ, మతపార్టీల నాయకులు పాల్గొన్నారు. అచల భారత సర్వమత సదస్సులో వక్తలు ప్రసంగిస్తూ సయ్యద్ జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలి సజ్జదా నషీన్ సందేశాన్ని కొనియాడుతూ భారతదేశంలో భిన్న మతాల ప్రజలు సోదరభావంతో, ఐక్యతతో జీవిస్తున్నారని, ఇదే భారతదేశ లక్షణమని అన్నారు. మనుషులు ఒకరికొకరు పనిచేస్తే మానవత్వం ప్రతిమతం బోధించేది ఇదే. ఏ మతమూ ద్వేషాన్ని బోధించదు. సాధువుల పుణ్యక్షేత్రాల నుండి మాత్రమే ప్రేమ బోధించబడుతుంది. ప్రతి మతానికి చెందిన అనుచరులు హాజరవుతారు. వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో వివిధ మతాలకు చెందినవారు నివసిస్తున్నారన్నారు. ఇది భారతదేశం యొక్క గుర్తింపు ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన వక్తలు సయ్యద్ షా జలాల్ హుస్సేని, అష్రఫి జలాలి సజ్జదా నాషిన్ బర్గా ఖతాలియా కొల్లంపల్లిని అభినందిస్తూ సదస్సు నిర్వహించి ప్రజలకు మంచి సందేశాన్ని అందిస్తున్నారని అన్నారు. మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ అష్రాఫీ జలాలి వారసుడు సజ్జదా బర్గా ఖతాలియా కొల్లంపల్లి అతిథులుగా పాల్గొంటారు. మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియా కొల్లంపల్లిలోని పేద విద్యార్థులకు బట్టల పంపిణీని కూడా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, ఇతర అతిథులు నిర్వహించారు. ఖవాజా సర్వర్ నాత్ పఠించగా మహ్మద్ రఫీ పవిత్ర ఖురాన్ పఠనంతో సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సును అబ్దుల్ సలీం అడ్వకేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమీరుద్దీన్ అడ్వకేట్ కౌన్సిలర్ మహ్మద్ షఫి చంద్, మహ్మద్ తకీచంద్ కౌన్సిలర్, మహ్మద్ తాజుద్దిన్, జిల్లా సహాయ సభ్యుడు సయ్యద్ దస్తగిరి హుసేని, బ్రదర్ సజ్జద సయ్యద్ అరఫ్ ఖాద్రి, మండల మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ అలీషేర్, మండల మైనార్టీ ప్రెసిడెంట్ మహ్మద్ జాఫర్ తాజ్, సంపత్ ధరగ్, మహ్మద్ అస్లాం, సర్వరాజ్ హుస్సేన్ అన్సారీ, మహ్మద్ అన్సారీ, ఫెరోజ్, దస్తగిర్ చంద్, గౌస్ అన్వర్, ఫజల్ అహ్మద్ ఇతరులు హాజరయ్యారు. సయ్యద్ ఫైజ్‌పాషా ముగింపు మాటలతో సదస్సు ముగిసింది.



సదస్సుకు హాజరైన వక్తలు

# బిఆర్ఎస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 19 ప్రభాతవార్త :** ఈ నెల 16న మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో ప్రచారం నిర్వహించిన విషయమై మహబూబ్‌నగర్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం 4 నివేదిక ఆధారంగా మహబూబ్‌నగర్ రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల ను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోవడం ప్రజా ప్రాతిని ధ్యం చట్టం 1951 ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుంది. ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియ మావళి ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదవుతుంది.

# అభ్యర్థుల గుణగణాలు చూడాలి..

## పార్టీల చరిత్ర, నడవడిక నిర్ణయాలు విధివిధానాలు చూడాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ 50 ఏళ్లు ఢిల్లీలో ఇక్కడ పాలించింది. అప్పుడేం చేసింది ఇప్పుడు 10 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ వచ్చాక ఏం చేసిందో ప్రజలు గమనించాలని టిఆర్ఎస్ పార్టీ అధినేత సీఎం కెసిఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. పార్టీల చరిత్రను విధి విధానాలను, నిర్ణయాలను గమనించాలని అభ్యర్థుల గుణగణాలను పరిశీలించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టింది కాంగ్రెస్ అని, బలవంతంగా తీసుకుపోయి ఆంధ్రాలో కలిపింది ఇదే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. హైదరాబాద్ సిటీ కాలేజీలో 7 మంది విద్యార్థులకు కాల్చి చంపి బలవంతంగా ఆంధ్రాలో విలీన చేశారని చెప్పుకొచ్చారు. 1969లో తొలి తెలంగాణ ఉద్యమంలో 400ల మందిని పైగా పిట్టలు కాల్చినట్లు కాల్చి చంపారని గుర్తు చేశారు. 2000 సంవత్సరంలో జై తెలంగాణ నినాదంతో టిఆర్ఎస్ పుట్టుకొచ్చిందన్నారు. 2004లో మళ్లీ మీతో పొత్తు పెట్టుకుంటాం తెలంగాణ ఇస్తామని చెప్పి అప్పుడు మోసం చేశారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి చావులే ప్రజలను కాల్చి చంపుడు, నక్సలైట్ ఉద్యమాలు, ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ పార్టీ ముందుకు పెడుతుంటే రైతులు ప్రజలు సుభిక్షంగా ఉంటే ఎన్టీ రామారావు రెండు రూపాయల కిలోబియ్యం అనే పథకాన్ని ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చింది, ఇందిరమ్మ రాజ్యంలో రాసి రంపాన పెట్టి దోపిడీ చేశారు. ఇప్పుడు వచ్చింది ఓట్లు ఎన్నికలు కావని తెలంగాణ బతుకు పోరాటమని కెసిఆర్ పిలుపునిచ్చారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తానికి అన్నంపెట్టే ప్రాజెక్టు అని చెప్పారు. 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఒక్క రూపాయి అయినా ఇచ్చిండ్రా, బ్యాంకుల లోన్ తీసుకుటే అప్పు కట్టకపోతే ఇండ్ల దర్వాజాలు పీక్కపోయిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక రైతుబంధు పేరుతో ఎకరాకు 5 వేలు అందజేస్తున్నామని అన్ని విడతల వారిగా ఎనిమిది వేలకు పెంచుతామని చెప్పారు. పదేళ్లు తన్నాడి ఒక అభివృద్ధి బాటలో ఆయననుంచేలా చేసిన తెలంగాణను కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎడారిగా మారుస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలోని మోడీ తెలంగాణలోని రైతుల బోరుబావుల దగ్గర మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పాడని కానీ తాను ససేమిరా ఒప్పుకోలేదని తేల్చి చెప్పారు. రైతుల మోటార్లకు మోటార్లు పెట్టకుంటే ఏడాదికి 5000ల కోట్ల చొప్పున ఐదేళ్లకు 25 వేల కోట్ల రూపాయల బడ్జెట్లో కోత విధించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి ఎత్తేస్తామని చెబుతున్నారని బంగాళాఖాతంలో కలిపేస్తామని చెబుతున్నారని ధరణి లేకపోతే రైతుల బతుకులు ఆగమైతాయన్నారు.




ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్

### ఏమిచ్చిన మీ రుణం తీర్చుకోలేను..

**-నేను ఏ తప్పు చేయలేదు... మీ సేవకై జీవిస్తా...**

**-ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 19 ప్రభాతవార్త:** కందనూలు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అన్ని వసతులు కల్పించి అభివృద్ధి పథంలో నడిపించి కాదనుకున్న జిల్లాను ఏర్పాటు చేసి కందనూలు జిల్లా ప్రజల అకాంక్షను నేరవేర్చి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు, విద్యా, వైద్యంలో ఎలాంటి లోట్లు లేకుండా సకల సౌకర్యాలు కల్పించిన మీకు ఏమిచ్చిన మీ రుణం తీర్చుకోలేమని ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ప్రాంతం వలస వాదుల పాలనలో కరువులతో అల్లాడుతూ ప్రజలు వలసలు వెళ్లేవారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆ ర్ చొరవతో మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించి 17 తండాలు, 5 గ్రామాలు, 8వేల ఎకరాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి రైతాంగాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రైతన్న మెమోలో చిరునవ్వు చూస్తూ అనాటి వలసలను నిలిపిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా అంటేనే సీఎం కేసీఆర్‌కు అంతులేని ప్రేమ అని, అడగ కుండానే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రజల మద్దతు, సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పర్చడంతో పాటు నా ఊపిరి, నా ప్రాణం ఉన్నంత వరకు మీ సేవకుడిగా మీ ముందు ఉంటానని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి లోటు లేకుండా సేవలు చేస్తున్నానే తప్ప ఏ నాడు కూడా ఏ తప్పు చేయలేదని, మీ రుణం తీర్చుకు నేందుకు నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించి సేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభం కావడంతో వ్యవసాయం పెరిగిందని, వ్యవసాయానికి సంబంధించిన ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు.



పజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

### పాలమూరు-రంగారెడ్డితో 1.25లక్షల ఎకరాలకు సాగునీరు

**-కల్వకుర్తి అభివృద్ధే నా ధ్యేయం**

**-ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**కల్వకుర్తి, నవంబర్ 19 ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి తోడ్పాటు వేసిన సీఎం కేసీఆర్‌కి ఈ ప్రాంత ప్రజలందరు రుణపడి ఉంటామని, కల్వకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ప్రాజెక్టు ద్వారా 90వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు రూ.8.50 కోట్లు మంజూరు చేసి రైతులను ఆదుకుంటున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో మెరుగైన వైద్యం అందించేందుకు 100, 50 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలో 1800 ఎకరాలకు ఓఆర్‌సీ పట్టా వచ్చిందని, మధ్యంతరంగా అది నిలిచిపోయిందని, దానిని క్లియర్ చేస్తే ఆ ప్రాంత రైతులు బాగు పడుతారని, పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తే ఈ ప్రాంత గిరిజనులు అభివృద్ధి చెందుతారని, కల్వకుర్తిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఐటీ హబ్ ఇవ్వాలని, ఆమనగల్లులో ఆర్డీఓ, ఎంవీఐ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో నూతనంగా మరో 2 మండలాల ఏర్పాటు చేయాలని, వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంలో అలంపూర్ నియోజకవర్గం ఆగమయింది

**వాల్మీకులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది**

**3 గంటల కాంగ్రెస్ కావాలా... 24 గంటల బిఆర్ఎస్ పార్టీ కావాలా**

**శాంతినగర్ ఎన్నికల సభలో ముఖ్యమంత్రి కెసిఆర్**

**ఇటిక్యాల,నవంబరు 19 ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో కావాల్సింది ఫ్యాక్షనిస్టులు, దాదాగిరి, గుండాగిరి కాదని, ప్రజాస్వామ్యంలో శాంతియుతమైన ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకునేందుకు ఓటు ఆయుధంగా వాడుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ మీద జరిగిన జలదోపిడి, అన్యాయం వల్ల అలంపూర్ నియోజకవర్గం ఎంతో ఆగమైందని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో వాల్మీకులకు అన్యాయం జరిగిందని ప్రభుత్వం ఇచ్చే 24 గంటల విద్యుత్ కావాలా కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మూడు గంటల కరెంటు కావాలా ప్రజలు తేల్చుకోవాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు సూచించారు. ఆదివారం శాంతినగర్ పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కెసిఆర్ హాజరై ప్రసంగిస్తూ జోగుళాంబ అమ్మవారి దేవస్థానం అద్భుమైన శక్తి పీఠాలలో ఐదో స్థానంలో ఉన్నదని, అక్కడి నుంచే అమ్మవారికి దండం పెట్టి అలంపూర్ ప్రజలకు జరుగుతున్న అన్యాయం మీద 2002లో అలంపూర్ నుంచి గద్వాల దాకా పాదయాత్ర చేశానని చెప్పారు. ప్రజలకున్న ఆయుధం ఓటు కాబట్టి దాన్ని జాగ్రత్తగా వాడుకుంటే మంచి జరిగే అవకాశం ఉంటదని సూచించారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో జరిగిన జలదోపిడి మీకు తెలుసని అంతేకాక ఆర్డీఎస్ ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందక రైతులు ఎంతో నష్టపోయారని గుర్తు చేశారు. ఉద్యమకాలంలో ఇక్కడే ఒక రైతు నాకు ఆశ్రయం ఇస్తే ఇక్కడే బసచేశానని ఆర్డీఎస్ ప్రాజెక్టును పరిశీలించి జరిగిన తీరును చూశానని రైతులకు సాగునీరులేక ఇక్కడ రైతులు, ప్రజలు బొంబాయికి వలసలు పోయి కూలీలుగా మారిపోయారని వివరించారు. 9 ఏండ్ల తెలంగాణ ప్రభుత్వంలో అభివృద్ధి ఏ విధంగా ఉందో గత ప్రభుత్వాలలో ఎలా ఉందో ఒకసారి నెమరు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేసిన పొరపాటు వల్ల తెలంగాణ రాష్ట్రం వెనుకబాటుకు - మిగతా2లో..



# వైభవంగా ఉద్దాల మహోత్సవం..!

**గోవిందా... కురుమూర్తి వాసా గోవిందా**

**వేలాదిగా తరలివచ్చిన భక్తజనం**

**దాసంగాలతో స్వామివారికి నైవేద్యం**

**రాజకీయ నాయకుల తీరుపై భక్తుల అసహనం**

**చిన్నచింతకుంట, నవంబరు 19 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్యదైవం పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల మహోత్సవం వేలాదిగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో వైభవంగా జరిగింది. మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామంలో ఉద్దాల కర్మాగారంలో వారం రోజులపాటు నియమ నిష్టలతో దళితులు స్వామివారి పాదుకలను తయారు చేశారు. స్వామివారి పాదుకలను దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు ఉద్దాల కర్మాగానికి తరలివచ్చారు. పల్లమర్రి గ్రామంలో మేదరులు తయారు చేసిన చాటను బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి. మధుసూదన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై చాటనుంచి బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా లాల్‌కోట, నెల్లికొండి, పెద్దవడ్డెమాన్ గ్రామాల మీదుగా చిన్న వడ్డెమాన్‌లోని ఉద్దాల కర్మాగారంకు తీసుకొచ్చారు. చాటను ఉద్దాల కర్మాగారంలోకి చర్మకారులు తీసుకొచ్చారు. అక్కడ స్వామివారి పాదుకలను చాటలో ఉంచి కర్మగారం ముందు ఉన్న కట్టపైకి తీసుకొచ్చారు. స్వామివారి పాదుకలకు సాంప్రదాయ ప్రకారం నెల్లివంశీయులు తొలిపూజలు నిర్వహించి అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆల, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జిఎంఆర్‌లతో పాటు ఎంపిపి హర్షవర్ధన్‌రెడ్డి, జడ్పీటిసి వట్టెం రాజేశ్వరి రాము, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్, ఎంపిటిసి స్వప్న శివకుమార్‌లు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి స్వామివారి పాదుకలను వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడు సమీపంలోని ఊకచెట్టు వాగులోకి తీసుకెళ్లారు. అక్కడ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి పాదుకలకు పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి ఉద్దాలను భక్తలపై నుంచి తీసుకెళ్లారు. సుమారు గంటపాటు వాగులోని స్వామివారి పాదుకలను ఉంచడంతో అక్కడ చిన్నపాటి తిరునాళ్లుగా తలపిస్తుంది. అక్కడి నుంచి స్వామివారి పాదుకలను మోచేతులు ఆధారంగా చిల్లబాట వెంట తిరుమలాపూర్ గ్రామానికి చేరుకోగానే అక్కడ వందలాదిగా భక్తులు స్వాగతం పలికారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారి పాదుకలకు పూజ నిర్వహించిన అనంతరం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామివారి పాదుకలను ఉంచి వేలాది భక్తుల గోవింద నామస్మరణ నడుమ జాతర సమీపంలోకి రాగానే శివసత్తుల పూనకాలతో భక్తులు రాగా వారిని అదుపు చేసేందుకు పోలీసులు ఇబ్బంది పడ్డారు. అక్కడినుండి కొండ దిగువన జాతర మైదానానికి స్వామివారి పాదుకలు రాగానే కురుమతి గిరులు భక్తుల గోవింద నామస్మరణతో పులకరించాయి. స్వామివారి పాదుకలను ఉంచిన ట్రాక్టర్ మూడు సార్లు ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం స్వామివారి ఉద్దాలకు దేవస్థాన అధికారులు పూజ నిర్వహించిన అనంతరం కొండపై గల ఉద్దాల మండపానికి చేరుస్తారు. అక్కడ దళితులే పూజారులు, ఉద్దాల మండపానికి చేరిన స్వామివారి పాదుకలను భక్తులు దర్శించుకుని పునీతులయ్యారు. ఉద్దాల మహోత్సవంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

### దాసంగాలతో స్వామికి మొక్కులు...

శ్రీ కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం, స్వామివారికి మొక్కుల రూపేనా కొత్త మట్టి కుండలో పచ్చిపులుసు, పరమాన్నంతో స్వామివారికి నైవేద్య సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలుగు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో - మిగతా2లో..



కురుమూర్తి వెంకటేశ్వరస్వామి వారి మూలవిరాట్టు



స్వామివారి పాదుకలను దర్శించుకుంటున్న మహిళా భక్తులు



స్వామివారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



పాదుకలను దర్శించుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

